

ఆర్మ్డ్ రిజర్వ్ ఏఆర్ ఎస్సైకు ఆత్మీయ వీడ్కోలు

విశాలాంధ్ర - అనకాపల్లి: ఆర్మ్డ్ రిజర్వ్ ఏఆర్ ఎస్సై టి.సత్యనారాయణ రాజుకి జిల్లా ఎస్పీ ఎం.దీపిక ఘనంగా సన్మానించి జ్ఞాపికలు అందజేశారు. పదవి విరమణ అనంతరం జీవితాన్ని ప్రశాంతంగా, సుఖ సంతోషాలతో గడపాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీలు బి.విజయ భాస్కర్, ఎస్.బి డీఎస్పీ బి.అప్పారావు, పరవాడ సబ్ డివిజన్ డీఎస్పీ కె.వి.సత్య నారాయణ, దిశా డీఎస్పీ ఎం.ఉపేంద్ర బాబు, ఏ.ఆర్ డీఎస్పీ పి.నాగేశ్వరరావు, ఇన్‌స్పెక్టర్‌లు లక్ష్మణమూర్తి, చంద్రశేఖర్, అప్పల నాయుడు, గణేష్, సతీష్, మన్మధరావు, నరసింహమూర్తి, సంజీవరావు, ఎస్సైలు రామారావు, రఘువర్మ, జిల్లా సీఐలు, ఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు.

నిరుపయోగంగా ఏషియన్ పెయింట్స్ మరుగుదొడ్లు

ఏళ్లు గడుస్తున్నా వినియోగించని వైనం

విశాలాంధ్ర - అచ్యుతాపురం: సిఎస్ఆర్ నిధులతో ఏషియన్ పెయింట్స్ పరిశ్రమ ఏర్పాటు చేసిన సామాజిక మరుగుదొడ్లు నిర్వహణ లేక నిరుపయోగంగా ఉన్నాయి. మండలంలో మత్స్యకార గ్రామమైన పూడిమడకలో సిఎస్ఆర్ నిధులు 20 లక్షలతో నిర్మించిన సామాజిక మరుగుదొడ్లు ప్రారంభించి సంవత్సరం గడుస్తున్న నేటికీ ఉపయోగంలోకి తీసుకురాలేదు. దీంతో సామాజిక మరుగుదొడ్ల ముందే కొంతమంది బహిరంగ మలవిసర్జన చేస్తుండడంతో ఆ ప్రాంతాలు క్రిమికీటకాలతో పాటు దోమలకు నిలయంగా మారింది. పక్కనే అంగన్వాడి కేంద్రం, ప్రాథమిక పాఠశాల ఉన్నాయి. పరిసర ప్రాంతాలలో దుర్గంధ భరితమైన వాసన రావడంతో అంగన్వాడీ విద్యార్థులు, పాఠశాల విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తల్లిదండ్రులు వాపోతున్నారు. ఏషియన్ పెయింట్స్ పరిశ్రమ సిఎస్ఆర్ నిధులతో పూడిమడకలో రెండు చోట్ల ప్రజల సౌకర్యార్థం సామాజిక మరుగుదొడ్లు నిర్మించారు. రెండు చోట్ల నిర్వహణ చేపట్టక నిరుపయోగంగా ఉండడంతో ముఖ్యంగా మహిళలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా స్పందించి మరుగుదొడ్లను ఉపయోగంలోకి తీసుకురావాలని మహిళలు తదితరులు కోరుతున్నారు.

హోం మంత్రి అనిత దృష్టికి పలు సమస్యలు

విశాలాంధ్ర - పాయకరావుపేట: రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత మండలంలోని గుంటపల్లి గ్రామంలో పర్యటించారు. ఈ సందర్భంగా పలువురు పలు సమస్యలను మంత్రి అనిత దృష్టికి తీసుకొచ్చారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ గెద్దం బుజ్జి, టీడీపీ మండల అధ్యక్షుడు పెదిరెడ్డి చిట్టిబాబు, గెద్దం కన్నబాబు, తోట నగేష్, గొర్రెల రాజబాబు, మజ్జూరి నారాయణరావు, యాళ్ళ వరహాల బాబు, చిక్కాల శ్రీను, గెద్దం చైతన్య, మల్లపురెడ్డి రమాకుమారి, పెదిరెడ్డి నాగ వెంకటరమణ, పలువురు జనసేన నాయకులు పాల్గొన్నారు.

పదవి విరమణ ఉపాధ్యాయుడు ఔదార్యం

విశాలాంధ్ర - అచ్యుతాపురం: సోషల్ ఉపాధ్యాయుడు పిటి వెంకటేష్ విద్యాబుద్ధులు నేర్పి పదవి విరమణ సందర్భంగా విద్యార్థులకు స్టీల్ కంచాలను పంపిణీ చేసి తన ఔదార్యం చాటుకున్నారు. బుధవారం మండలంలో హరిపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోషల్ ఉపాధ్యాయుడు పిటి వెంకటేశ్ పదవీ విరమణ పూర్తయిన సందర్భంగా 165 మంది విద్యార్థులకు స్టీల్ కంచాలు అందజేశారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు శ్రీపాద రవి, తోటి ఉపాధ్యాయులు ఆయనకు పదవి విరమణ శుభాకాంక్షలు తెలియజేస్తూ అభినందించారు. ఈ కార్యక్రమంలో తెలుగు ఉపాధ్యాయిని రమణి, వ్యాయామ ఉపాధ్యాయుడు రాజు, విద్యార్థిని, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

బంగారమ్మ పాలెం సముద్ర తీరాన్ని పరిశీలించిన ఎస్‌డీసీ

విశాలాంధ్ర - యస్.రాయవరం: మండలంలో వాకపాడు పంచాయతీ పరిధిలోని బంగారమ్మ పాలెం సముద్ర తీరాన్ని ఎన్ఏఓబి (నావెల్ బేస్) స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ మనోరమ పరిశీలించారు. మత్స్యకారుల సమస్యలపై ఉన్నతాధికారుల దృష్టికి వెళ్లడంతో కలెక్టర్ ఆదేశాల మేరకు సముద్ర తీరాన్ని పరిశీలించి పలు వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా మత్స్య శాఖ అధికారి ప్రసాద్, మత్స్య శాఖ అభివృద్ధి అధికారి రవితేజ, మండల సర్వేయర్ త్రిమూర్తి తదితరులు పాల్గొన్నారు.

యస్.రాయవరంలో పర్యటించిన డీపీఓ

విశాలాంధ్ర - యస్.రాయవరం: మండల కేంద్రమైన ఎస్.రాయవరంలో జిల్లా పంచాయతీ అధికారి శిరీష రాణి పర్యటించారు. ఘన వ్యర్థ పదార్థాల నిర్వహణ కేంద్రం పరిశీలించి పలు సూచనలు చేశారు. సంపద కేంద్రంను వినియోగంలోకి తీసుకురావాలని ఆదే శించారు. అలాగే సర్వసిద్ధి కాలువలో మురుగు నీరు వదలడం వల్ల రైతులు ఇబ్బందులు పడుతున్నారని ఫిర్యాదు పై పంట కాలు వ ను పరిశీలించారు. దీనిపై ఉన్నతాధికారులకు నివేదిక ఇస్తా మని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో నర్సీపట్నం డివిఎల్ పివో మూర్తి, ఈవోపీఆర్డీ సత్యనారాయణ, సర్పంచ్ భూపతి అప్పా రా వు, పంచాయతీ కార్యదర్శి సత్యనారాయణ పాల్గొన్నారు.

కసిమిలో వైద్య శిబిరం

విశాలాంధ్ర - గొలుగొండ: వాతావరణంలో మార్పులతో సీజనల్‌గా వచ్చే వ్యాధులు పట్ల ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని చీడిగుమ్మల పీహెచ్‌సీ వైద్యాధికారి ధనుంజయ్ సూచించారు. మండలంలో కసిమి గ్రామంలో బుధవారం డాక్టర్ ధనుంజయ్ ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. బీపీ, షుగర్ పరీక్షలతో పాటు మలేరియా ఇతర వ్యాధులకు పరీక్షలు నిర్వహించారు. అనంతరం వారికి అవసరమైన మందులను అందించారు. ఈ వైద్య శిబిరంలో డాక్టర్ గొర్లె మధుసూదనరావు, ఎం.ఎల్.హెచ్.పి వెంకటలక్ష్మి, ఏఎన్ఎం లోవలక్ష్మి, ఆశ వర్కర్లు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

అన్నా క్యాంటీన్ వద్ద ఎన్టీఆర్ విగ్రహం ఏర్పాటు చేయాలి

విశాలాంధ్ర - యలమంచిలి: పట్టణంలో నూతనంగా ఏర్పాటు చేసిన అన్నా క్యాంటీన్ ముందు ఎన్టీఆర్ విగ్రహం ఏర్పాటుకు అనుమతులు ఇవ్వాలని కోరుతూ కూటమి నాయకులు మున్సిపల్ కమిషనర్‌కి వినతి పత్రం అందజేశారు. బుధవారం పట్టణంలో నూతనంగా ఏర్పాటు చేస్తున్న అన్నా క్యాంటీన్ ముందు స్థలంలో దివంగత మాజీ ముఖ్యమంత్రి ఎన్టీఆర్ విగ్రహం ఏర్పాటు చేయుటకై మున్సిపాలిటీ స్థలం కేటాయించి అనుమతులు ఇవ్వాలని మున్సిపల్ కమిషనర్ డి.ప్రభాకర్‌ను కూటమి నాయకులు కోరారు. ఈ సందర్భంగా జనసేన పార్టీ టౌన్ అధ్యక్షుడు బొద్దపు శ్రీనివాసరావు, టీడీపీ పార్టీ టౌన్ అధ్యక్షులు గొర్లి నానాజీలు మాట్లాడుతూ స్థానిక ఎమ్మెల్యే సుందరపు విజయ్ కుమార్ తన సొంత నిధులతో ఏర్పాటు చేస్తారని అన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి, జనసేన పార్టీ సర్పంచ్ నాయుడు, కౌన్సిలర్ మజ్జి రామకృష్ణ, సత్యనారాయణ, కరణం రవి, ఆడారి రమణ, దవులూరి పెంటయ్య తదితరులు పాల్గొన్నారు.

గంజాయి అక్రమ రవాణాలో పోలీసుల పాత్ర ఉంటే ఉపేక్షించం

జిల్లా ఎస్పీ ఎం.దీపిక

విశాలాంధ్ర బ్యూరో - అనకాపల్లి: ఫార్వర్డ్, బ్యాక్ వర్డ్ లింకులను గుర్తించి, గంజాయి అక్రమ రవాణా కేసుల్లో తప్పించుకు తిరుగుతున్న నిందితులను అరెస్టు చేయాలని జిల్లా ఎస్పీ ఎం.దీపిక జిల్లా పోలీసులను ఆదేశించారు. నెలవారీ నేర సమీక్ష సమావేశం బుధవారం ఎస్పీ కార్యాలయంలో జరిగింది. దర్యాప్తులో ఉన్న సాధారణ, తీవ్రమైన ముఖ్యమైన కేసులు, ప్రాపర్టీ కేసులు, 174 సీఆర్పీసీ కేసులు, గంజాయి కేసులు, మిస్సింగ్ కేసులను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా సమీక్షించి ఆయా కేసుల్లో దర్యాప్తు పెండింగ్‌లో ఉండడానికి గల కారణాలను సంబంధిత అధికారుల నుండి తెలుసుకొని త్వరితగతిన దర్యాప్తు చేయుటకు ఎస్పీ పలు సూచనలు చేశారు. గంజాయి అక్రమ రవాణా జరిగే ఆంధ్ర, ఒడిస్సా సరిహద్దు జిల్లాల నుండి ఏజెన్సీ ప్రాంతం వైపు నుండి వివిధ మార్గాల్లో గంజాయి అక్రమ రవాణాను గుర్తించడం, ఇంటిలిజెన్స్ సమాచారాన్ని సేకరించి ఆకస్మిక, డైనమిక్ వాహన తనిఖీలు నిర్వహించాలన్నారు. గంజాయి అక్రమ రవాణా కేసుల్లో పోలీస్ సిబ్బంది పాత్ర ఉన్నట్లు విచారణలో వెల్లడైతే ఎంతటి వారికైనా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. మహిళలు, బాలికలపై జరిగే నేరాలు పట్ల పోలీస్ అధికారులు ప్రత్యేక చొరవ తీసుకుని, దర్యాప్తును సమగ్రంగా నిర్వహించి కోర్టులో శిక్షలు పడే విధంగా పటిష్ట చర్యలు చేపట్టాలన్నారు. నేరాలు నియంత్రించేందుకు పగలు, రాత్రి గస్తీలను ముమ్మరం చేయాలని బ్యాంకులు, ఏటీఎంలు వద్ద తనిఖీలు నిర్వహించాలన్నారు. పాత నేరస్థులపై నిఘా ఏర్పాటు చేయాలన్నారు. ప్రజలకు నేరాలు పట్ల, సైబర్ క్రైమ్స్ పట్ల అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణకు విజిబుల్ పోలీసింగ్ నిర్వహిస్తూ, ఎన్ఫోర్స్మెంట్ కేసులు ఎక్కువ నమోదు చేయాలన్నారు. ప్రజలకు రోడ్డు భద్రతా నియమాల పట్ల అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. ఈ నేర సమీక్ష సమావేశంలో ప్రతిభ కనబరిచిన 15 మంది పోలీసు అధికారులు, సిబ్బందికి ప్రశంసా పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీలు బి.విజయ భాస్కర్, ఎస్.బి డీఎస్పీ బి.అప్పారావు, పరవాడ సబ్ డివిజన్ డీఎస్పీ కె.వి.సత్య నారాయణ, దిశా డీఎస్పీ ఎం.ఉపేంద్ర బాబు, ఏ.ఆర్ డీఎస్పీ పి.నాగేశ్వరరావు ఇనస్పెక్టర్‌లు లక్ష్మణమూర్తి, చంద్రశేఖర్, అప్పలనాయుడు, గణేష్, సతీష్, మన్మధరావు, నరసింహమూర్తి, సంజీవరావు, ఎస్సైలు రామారావు, రఘువర్మ, జిల్లా సీఐలు, ఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు.

8న పాఠశాలల మేనేజ్‌మెంట్ కమిటీలకు ఎన్నికలు

విశాలాంధ్ర - కె.కోటపాడు: పాఠశాలల మేనేజ్మెంట్ కమిటీల ఎన్నికలకు ప్రభుత్వం షెడ్యూల్ విడుదల చేసిందని ఎంఈఓ కే.సత్యనారాయణ తెలిపారు. బుధవారం మండల విద్యాశాఖ కార్యాలయంలో పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. తల్లిదండ్రుల కమిటీల పేరును మేనేజ్మెంట్ కమిటీలుగా మార్పు చేసిందని అన్నారు. గత ప్రభుత్వంలో ఎంపికైన కమిటీల పదవీకాలం జూలైతో ముగియటంతో ఆగస్టులో ఎన్నికలకు షెడ్యూల్ ప్రకటించిందని అన్నారు. కమిటీ చైర్మన్, వైస్ చైర్మన్ సభ్యుల ఎన్నికలకు 1వ తేదీ మధ్యాహ్నం 2 గంటలకు ఓటర్ల జాబితాను నోటీసు బోర్డులో ప్రదర్శించాలన్నారు. ఆగస్టు 5న ఉదయం 9 గంటల నుంచి పది గంటల వరకు ఓటర్ జాబితాపై అభ్యంతరాలు స్వీకరిస్తారని అన్నారు. అదే రోజు సాయంత్రం మూడు నాలుగు గంటల మధ్య తుది ఓటర్ల జాబితా ప్రకటిస్తారని అన్నారు. 8న ఎన్నికలు నిర్వహిస్తారని అనంతరం ఎన్నికైన సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించి మొదటి సమావేశాన్ని ఏర్పాటు చేయాలని చెప్పారు. సమగ్ర శిక్ష అభియాన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ మేనేజ్మెంట్ కమిటీ ఎన్నికలను ప్రధానోపాధ్యాయులు ఎంతో పారదర్శకంగా నిర్వహించాలని ఆయన తెలిపారు. ఈ సమావేశంలో ఎంఈఓ 2 డివిడి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

శరవేగంగా సిసిఆర్ కార్డులు

విశాలాంధ్ర - కే.కోటపాడు: కౌలు రైతులు క్రాప్ కల్టివేటర్స్ రైట్ కార్డు కలిగి ఉండాలని ఈ కార్డు వలన కౌలు రైతులు అనేక ప్రయోజనాలు పొందుతారని మండల వ్యవసాయ అధికారి సోమశేఖర్ తెలిపారు. కే.కోటపాడు మండలంలో ఇప్పటివరకు 22 గ్రామాల్లో 70 కౌలు ధ్రువపత్రాలను అందజేశామన్నారు. ఏ.కోడూరు రైతు సేవ కేంద్రంలో కౌలు రైతులకు ధ్రువపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూ యజమాని కౌలు రైతుకు అంగీకార పత్రం ఇవ్వడం వల్ల ఎటువంటి ఇబ్బంది కానీ, నష్టం కానీ ఉండదన్నారు. ఈ కార్డు గడువు కేవలం 11 నెలల కాల పరిమితి ఉంటుందన్నారు. కౌలు రైతుకు ప్రభుత్వం అందించే క్రాఫ్ట్ ఇన్సూరెన్స్ ధాన్యం సేకరణ వంటి కార్యక్రమాలకు అర్హులన్నారు. అలాగే ఇతర రాయితీలు పొందుతారని స్పష్టం చేశారు. పండ్ల రైతులు, కూరగాయల రైతులు కూడా ఈ కార్డులు పొందవచ్చు అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీఈవో విజయ్ తదితరులు పాల్గొన్నారు.

ములబందగోడి రైతు సంఘం అధ్యక్షుడుగా దాడి

విశాలాంధ్ర - మునగపాక: ములబందగోడి రైతు సంఘం అధ్యక్షుడుగా దాడి శివ ఎన్నికయ్యారు. మండల కేంద్రంలో సంతబయలు వినాయక కల్యాణ మండపంలో బుధవారం ములబందగోడి రైతు సంఘం సర్వ సభ్య సమావేశం జరిగింది. ఏడాది కాలంలో జరిగిన మంచి చెడ్డలపై పెద్దలు, పలువురు సభ్యులు మాట్లాడారు. అనంతరం ఎన్నికల అధికారి దాడి సూర్యనారాయణ సారథ్యంలో నూతన పాలక వర్గం ఎన్నిక జరిగింది. అధ్యక్షుడుగా దాడి శివ, కార్యదర్శిగా ఆడారి రాము, కోశాధికారిగా దొడ్డి గంగసూరి అప్పారావు విజయం సాధించారు. డైరెక్టర్‌లుగా బొడ్డేడ రాము, టెక్కలి శ్రీనివాసరావు, సూరిశెట్టి కాశి, దొడ్డి మురళి, యల్లపు శ్రీను, దాడి సాంబ శివ, కొర్ని వెంకట్ నియామకం అయ్యారు. ఈ కార్యక్రమంలో సంఘ పెద్దలు దాడి శ్రీరామూర్తి, బొడ్డేడ రామునాయుడు, దాడి శివ కృష్ణ, దొడ్డి శివ, దొడ్డి రమణ, సంఘ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

మద్యం తాగి వాహనాలు నడిపిన 3 మందికి జరిమానా

విశాలాంధ్ర - అనకాపల్లి: ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ పైడపు నాయుడు వాహన తనిఖీలు చేస్తున్న సమయంలో మద్యం సేవించి వాహనాలు నడుపుతూ 13 మంది పట్టుబడగా వీరిని అనకాపల్లి, 13వ ఎం.ఎం కోర్టులో ప్రవేశపెట్టగా జడ్జ్ బి.వి.విజయలక్ష్మి వాహనదారులకు ఒక్కొక్కరికి రూ.10,000/- చొప్పున మొత్తం రూ.1,30,000/- జరిమానా విధించారు. రోడ్డు భద్రత నియమాలను పాటించడం ప్రతి ఒక్కరి బాధ్యతని, జిల్లాలోని ప్రతి ఒక్కరు రోడ్డు నియమాలను తప్పక పాటించాలని లేదా భారీ జరిమానాలు ఎదుర్కోవాల్సి ఉంటుందని ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ పైడపు నాయుడు తెలిపారు. మద్యం తాగి వాహనం నడపడం అత్యంత ప్రమాదకరమని, ఇది మీ ప్రాణాలకు, ఇతరుల ప్రాణాలకు ప్రమాదం కలిగిస్తుందని కౌన్సిలింగ్ చేశారు.

బీసీ కార్పొరేషన్ రుణాలను మంజూరు చేయాలి

ఉత్తరాంధ్ర బీసీ సంక్షేమ సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు మొల్లి రమణబాబు

విశాలాంధ్ర - అనకాపల్లి: విశాఖపట్నం, అనకాపల్లి జిల్లా నిరుద్యోగ స్థానికులకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని ఉత్తరాంధ్ర బీసీ సంక్షేమ సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు మొల్లి రమణబాబు ఒక ప్రకటనలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుని కోరారు. గత ఐదు సంవత్సరాలలో మూలన పడిపోయిన బీసీ కార్పొరేషన్ రుణాలను రాష్ట్రంలో అత్యధికంగా ఉన్న 139 బీసీ కులాలకు అందించే విషయంపై ప్రభుత్వం పునరాలోచన చేసి కార్పొరేషన్ రుణాలు వెంటనే మంజూరు చేయాలని కోరారు. అలాగే 2024 సంవత్సర ఎన్నికల సమయంలో బీసీలకు 50 సంవత్సరాలు దాటిన వారికి పెన్షన్ మంజూరు చేస్తానని ప్రకటించారని, కనుక ముఖ్యమంత్రి అర్హులైన బీసీలందరికీ పెన్షన్ మంజూరు చేయాలని కోరారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ శాఖలలో ఉన్న ఖాళీలను పూరించి యువతీ, యువకులకు ఉద్యోగాలను కల్పించాలని, అత్యధిక శాతం మానవ వనరులు, పారిశ్రామిక వనరులు కలిగిన విశాఖ, ఉత్తరాంధ్ర ప్రాంతాలలో పారిశ్రామిక సంస్థలలో యువతీ యువకులకు నైపుణ్య శిక్షణ ఇస్తూ అత్యధిక శాతం స్థానికులకే ఉద్యోగ అవకాశాలు కల్పించాలని కోరారు.

సీపీఎస్ పెన్షన్ విధానం రద్దు చేయాలి

ఎమ్మెల్సీ పాకలపాటి రఘువర్మ

విశాలాంధ్ర - రావికమతం: పదవి విరమణ పొందిన ఉపాధ్యాయులకు ఆర్థికంగా ఇబ్బందిగా ఉన్న సీపీఎస్ పెన్షన్ విధానాన్ని రద్దు చేయాలని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పాకలపాటి రఘువర్మ డిమాండ్ చేశారు. మండలంలో దొండపూడి హైస్కూల్ ఉపాధ్యాయుడు వెదురుపర్తి నాగేశ్వరరావు పదవి విరమణ కార్యక్రమానికి బుధవారం విచ్చేసిన ఆయన విలేకరులతో మాట్లాడారు. సీపీఎస్ పెన్షన్ విధానం వల్ల పదవి విరమణ పొందిన తరువాత ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కారణంగా తక్షణం సిపిఎస్ పెన్షన్ విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అలాగే ఉపాధ్యాయులు హేతుబద్ధీకరణకు జారీ చేసిన 117 జీవోను కూడా రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఆన్లైన్ యాప్‌లో పాఠశాలకు సంబంధించిన వివిధ అంశాలను అప్లోడ్ చేసే పని భారాన్ని ఉపాధ్యాయుల నుంచి వేరొకరికి అప్పగించాలని పెద్దల సభలో చర్చిస్తానన్నారు. మెసెంజర్ పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయుల పదవీ విరమణ వయసును 62 ఏళ్లకు పెంచాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్య క్రమంలో జిల్లా పరిషత్ హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు మల్లికార్జునరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు సకాలంలో సరకులు అందజేయాలి

విశాఖ జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్

విశాలాంధ్ర - విశాఖ కలెక్టరేట్: ప్రజా పంపిణీ వ్యవస్థను మరింత బలోపేతం చేయాలని, ప్రజలకు, నోడల్ ఏజెన్సీలకు సకాలంలో సరకులు అందజేయాలని జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్ సూచించారు. కలెక్టరేట్ వీసీ హాలులో ఈ మేరకు వివిధ శాఖల అధికారులు, సిబ్బందితో బుధవారం ఉదయం ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. అంగన్వాడీ కేంద్రాలకు, వసతి గృహాలకు, మధ్యాహ్న భోజనం పథకానికి సంబంధించి పాఠశాలలకు సరఫరా అవుతున్న సరకుల గురించి, ఎండీయూ వాహనాల ద్వారా ప్రజలకు పంపిణీ చేస్తున్న సరకుల గురించి ఆయా శాఖల అధికారులను అడిగి తెలుసుకున్నారు. ప్రజా అవసరాలకు, ఇతర ఏజెన్సీ నిర్వాహకులకు నాణ్యమైన సరకులు అందజేయాలని అధికారులను ఆదేశించారు. రేషన్ సరకులు తప్పుదారి పట్టకుండా చర్యలు తీసుకోవాలని, ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా అందే సేవలను మరింత విస్తృతం చేయాలని సూచించారు. ఈ క్రమంలో ఆయా శాఖల పరిధిలో ఉండే సమస్యలను అధికారులు జేసీ దృష్టికి తీసుకొచ్చారు. కార్యక్రమంలో డీఎస్వో సూర్యప్రకాశరావు, డీఎం సివిల్ సప్లైస్ రాజేశ్వరి, ఐసీడీఎస్ పీడీ జయదేవి, డీఈవో చంద్రకళ, బీసీ వెల్ఫేర్ అధికారిణి శ్రీదేవి, హెచ్.ఎం.లు, వివిధ ఏజెన్సీల నిర్వాహకులు, సీడీపీవోలు, అంగన్వాడీ నిర్వాహకులు, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు పంపిణీ

విశాలాంధ్ర - నక్కపల్లి: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ సూచనల మేరకు కళాశాల ప్రిన్సిపాల్ కే.శ్రీదేవి అధ్యాపక అధ్యాపకేతర సిబ్బంది కలసి కళాశాలలో విద్యార్థులకు ఉచిత పాఠ్యపుస్తకాలు, నోటు పుస్తకాలను అందజేశారు. గత సంవత్సరం ఉత్తీర్ణత శాతంలో అనకాపల్లి జిల్లాలో నాలుగో స్థానం ఉన్నటువంటి కళాశాల ఈ సంవత్సరం ప్రథమ స్థానానికి తీసుకెళ్ళుటకు కళాశాల సిబ్బంది కృషి చేయడం జరిగిందని ప్రిన్సిపల్ తెలిపారు.

అడ్డూరులో కత్తిపోట్లుకు గురైన వ్యక్తి మృతి

విశాలాంధ్ర - చోడవరం: చోడవరం మండలంలోని అడ్డూరు గ్రామంలో అల్లుడు చేతిలో కత్తిపోట్లుకు గురైన సానబోయిన పైడిరాజు (51) విశాఖ కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు బంధువులు తెలిపారు. కుమార్తె మామిడి పూర్ణ సంధ్యను కాపురానికి పంపలేదనే కోపంతో భర్త మామిడి వెంకట పైడితల్లి నాయుడు తన అత్త మామలపై కత్తితో దాడి చేసిన విషయం తెలిసిందే. అత్త లక్ష్మి మృతి చెందగా, మామ పైడిరాజు చికిత్స పొందుతూ మృతి చెందాడు. నిందితుడ్ని అడ్డూరు గ్రామంలో మామిడి వారి కల్లాలు వద్ద చోడవరం ఇన్‌స్పెక్టర్ బి.శ్రీనివాసరావు అరెస్ట్ చేశారు.

రహదారి భద్రతపై విద్యార్థులకు అవగాహన

విశాలాంధ్ర - అనకాపల్లి: రహదారి భద్రతలో భాగంగా బుధవారం ఏఎంఏఎల్ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో జిల్లా రవాణా అధికారి జి.మనోహర్ ఆధ్వర్యంలో రహదారి భద్రతపై విద్యార్థులకు అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. కళాశాల విద్యార్థినీ, విద్యార్థులకు రహదారి భద్రతపై పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా అవగాహన కల్పించారు. ముఖ్యంగా హెల్మెట్, సీట్ బెల్ట్, సెల్ ఫోన్ డ్రైవింగ్, మద్యం సేవించి వాహనం నడపడం, అతి వేగం, మైనర్ డ్రైవింగ్‌పై పూర్తి స్థాయి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ దాడి శ్రీనివాసరావు, కళాశాల ప్రిన్సిపాల్ జి.జయ బాబు, మోటార్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్ వి.గోపీక్రిష్ణ, ట్రైనీ ఇన్‌స్పెక్టర్స్ సాయి రమేష్, కే.నాగరాజు, ఎం.శివాని, టి.విజయభారతి, ఏ.గీత, కావ్య పాల్గొన్నారు.

నేడు పాఠశాల మేనేజ్మెంట్ కమిటీ ఎన్నికలకు నోటిఫికేషన్ జారీ

ఎంఈఓ తలుపులు

విశాలాంధ్ర-రావికమతం: మండలంలో అన్ని ప్రభుత్వ పాఠశాలల మేనేజ్మెంట్ కమిటీ ఎన్నికలకు ఆగస్టు 1 గురువారం నాడు నోటిఫికేషన్ జారీ చేయనున్నామని మండల విద్యాశాఖ అధికారి తలుపులు తెలిపారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడు తూ మండలంలో 51 ప్రాథమిక పాఠశా లలు, 9 అప్పర్ ప్రైమరీ స్కూల్స్, 11 హై స్కూల్స్ లలో మేనేజ్మెంట్ కమిటీ ఎన్నికలకు గురువారం ఉదయం 10 గంటలకు నోటి ఫికేషన్ జారీచేస్తామన్నారు. ఇదే రోజు ఓటర్ల జాబితా కూడా అందుబాటులో ఉంచు తామని తెలియజేశారు. ఈ జాబితాలో అభ్యంత రాలు, ఫిర్యాదులు ఆగస్టు 5న స్వీకరిస్తామని చెప్పారు. తుది జాబితా తయారైన తర్వాత ఆగస్టు 8న పాఠశాల మేనేజ్మెంట్ కమిటీ సభ్యులు, చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నికలు నిర్వహిస్తామని ఆయన వివరించారు.

స్థానిక సంస్థల ఎమ్మెల్సీ కోటా ఉప ఎన్నికకు మోగిన నగారా...

తక్షణమే అమల్లోకి ఎన్నికల కోడ్
స్పష్టం చేసిన కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్



విశాలాంధ్ర-విశాఖ కలెక్టరేట్ : ఉమ్మడి విశాఖ జిల్లాలో స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల షెడ్యూల్ కేంద్ర ఎన్నికల సంఘం మంగళవారం ప్రకటించిన నేపథ్యంలో తక్షణం ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చిందని, అధికారులు అందరూ అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ పేర్కొన్నారు. ఎన్నికల ప్రవర్తన నియమావళిని తప్పకుండా పాటించాలని జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ అన్నారు. ఎన్నికల షెడ్యూల్ విడుదల చేసిన నాటి నుంచే ఉమ్మడి విశాఖ జిల్లాలో మోడల్ కోడ్ ఆఫ్ కాండక్ట్ అమల్లో ఉంటుందని కలెక్టర్ స్పష్టం చేశారు. స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికలపై బుధవారం ఆయన జిల్లా కలెక్టర్ కార్యాలయం నుంచి వెబెక్స్ ద్వారా నిర్వహించిన సమావేశంలో ఎమ్మెల్సీ ఎన్నికల షెడ్యూల్, ప్రవర్తన నియమావళి తదితర అంశాలపై జిల్లా అధికారులకు వివరించారు.

ఆగస్టు 6 నుంచి నోటిఫికేషన్ ప్రక్రియ ప్రారంభం

స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికలకు ఆగస్టు 6 వ తేదీన నోటిఫికేషన్ వెలువడుతుందని, ఆగస్టు 13వ తేదీ వరకు నామినేషన్ల స్వీకరణ ఉంటుందని ఆయన అన్నారు. 14న స్క్రూటినీ , 16 న నామినేషన్ల ఉపసంహరణ ప్రక్రియ జరుగునని వివరించారు. ఆగస్టు 30 వ తేదీన ఉదయం 8 గం. నుండి సాయంత్రం 4 గం. వరకు పోలింగ్ ఉంటుందని, సెప్టెంబర్3 న ఓట్ల లెక్కింపు ప్రక్రియ ఉంటుందని ఆయన వెల్లడించారు. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు సంబంధిత శాఖల అధికారులందరూ ఎన్నికల ప్రవర్తన నియమావళిని తప్పనిసరిగా పాటించాల్సిందిగా ఆయన కోరారు.

ఎంసిసి కోడ్ నిబంధనలు తక్షణం అమలుకు చర్యలు

కోడ్ అమలులోకి వచ్చినందున వెంటనే అన్ని ప్రభుత్వ కార్యాలయాల పరిధిలో ఉన్న రాజకీయ నాయకుల చిత్రపటాలు, పోస్టర్లు, బ్యానర్లు తొలగించాలని చెప్పారు. బస్సులపై, బస్ స్టేషన్లలో, పబ్లిక్ ప్రదేశాల్లో ఉన్న అనధికార రాజకీయ పరమైన ప్రకటనలు, ఇతర చిత్రాలను తొలగించాలన్నారు. ప్రభుత్వ వెబ్ సైట్లలో ఉన్న రాజకీయ పరమైన ఫోటోలను కూడా తొలగించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. రాజకీయ నాయకుల విగ్రహాలకు ముసుగులు వేయాలని ఆదేశించారు. పట్టణ ప్రాంతంలో జీవిఎంసి, గ్రామీణ స్థాయిలో జిల్లా పంచాయతీ అధికారి ఎంసిసి నోడల్ అధికారులుగా వ్యవహరిస్తారని పేర్కొన్నారు. ఎన్నికల ప్రకటనల కోసం అభ్యర్థులు ముందస్తు అనుమతి తప్పనిసరి అని అన్నారు. ప్రకటన ధృవీకరణ , ప్రచార వ్యయ పర్యవేక్షణ, టెలివిజన్ ఛానెల్లు / కేబుల్ నెట్వర్క్, ప్రైవేట్ ఎఫ్.ఎం ఛానెల్లు, సినిమా హాల్స్, పబ్లిక్ ప్లేస్‌లో ఆడియో-విజువల్ డిస్ప్లేలతో సహా, ఫోన్‌లో ఎన్నికల ప్రచారానికి సంబంధించిన బల్క్ ఎస్ ఎంఎస్లు/వాయిస్ మెసేజ్‌లు సోషల్ మీడియా, ఎలక్ట్రానిక్ మీడియా యొక్క ఇతర మోడ్‌లకు వర్తించే చట్టపరమైన నిబంధనలు కూడా జిల్లా మీడియా సర్టిఫికేషన్ మరియు మానిటరింగ్ కమిటీ అనుమతితో మాత్రమే నిర్వహించాలన్నారు.

సామాజిక పెన్షన్లు పంపిణీ అధికారులు మాత్రమే చేయాలి

ప్రభుత్వ సామాజిక పెన్షన్ల పంపిణీ కార్యక్రమం పూర్తిస్థాయిలో అధికారులు సమక్షంలో మాత్రమే జరగాలని, రాజకీయ నాయకులు ఇతర స్థానిక సంస్థల సభ్యులు ప్రమేయం ఎట్టి పరిస్థితుల్లోనూ ఉండకూడదని సంబంధిత శాఖల అధికారులకు స్పష్టత నిచ్చారు. ప్రతి మండలంలో వీడియోగ్రఫీ టీములు ఏర్పాటు చేయాలని, అనధికార డబ్బు, మద్యం తరలింపు పూర్తిస్థాయిలో అరికట్టాలని అధికారులు ఆదేశించారు. ఈ వెబెక్స్ సమావేశంలో జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్,. జీవీఎంసీ, రెవెన్యూ, ఇతర జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.

భూగర్భ జలాలను స్థిరీకరించడానికి పచ్చదనం అవసరం

విశాలాంధ్ర-సింహాచలం: ఉత్తరాంధ్ర ఆరాధ్య దైవం శ్రీ వరాహలక్ష్మీ నరసింహస్వామి దేవస్థానంనగరంలో కాలుష్య స్థాయిలను తగ్గించడానికి మరియు భూగర్భ జలాలను స్థిరీకరించడానికి పచ్చదనాన్ని పునరుద్ధరించడానికి ఒక సమగ్ర ప్రాజెక్ట్ ను 2018 లో ప్రారంభించిన సంగతి పాఠకులకు. అప్పట్లో శ్రీవరాహలక్ష్మీ నరసింహ స్వామి దేవస్థానం సింహగిరి వనసంరక్షణ యజ్ఞాన్ని ప్రారంభించింది మరియు 2018 డిసెంబర్ చివరిలో లక్ష మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టారు. తిరిగి దేవస్థానం వారు మొక్కలు నాటే కార్యక్రమాన్ని ప్రారంభించి పర్యావరణాన్ని కాపాడాలని భక్తులు, ప్రజలు కోరుకుంటున్నారు. దేవస్థానం ప్రణాళికలు సిద్ధం చేసింది. 15 కిలోమీటర్ల వ్యాసార్థంలో విస్తరించి ఉన్న సింహాచలం కొండలు సంవత్సరానికి కనీసం 10,000 టన్నుల కార్బన్ ఉద్గారాలను తగ్గించగల సామర్థ్యాన్ని కలిగి ఉన్నాయి. తూర్పు కనుమలలో వృక్షజాలం మరియు జంతు జాలం ఉత్తమ వనరులలో ఇవి ఒకటి. నగరంలో వేగవంతమైన పట్టణీకరణ కారణంగా కొండలపై వదిలిన రాళ్లతో జీవవైవిధ్యం దెబ్బతింది. కొండ వెంబడి ఉన్న అనేక నీటి బుగ్గలు దాని అంచున చాలా వరకు అదృశ్య మయ్యాయి. అయితే దివంగత ప్రధాన అర్చకులు మోర్తా సీతారామ చార్యులు ఆయన ఈ దేవస్థానంలో చేరి నప్పటి నుంచి పదవీ విరమణ పొందినంత వరకు గంగ ధార కు నీటి ప్రవాహం కొండల్లో పలు జాతుల ఔషధ మొక్కలు, వృక్షాలను తాకుతూ ప్రవహించి గంగాధర కు వచ్చే నీటి మార్గాన్ని దొరల సాయంతో చెట్ల, మొక్కల వేళ్ళు, చెత్తా, చెదారం (ఎండిన ఆకులు, పుల్లలు) తీసి వేస్తుండే వారు. తద్వారా గంగ ధార కు వచ్చే నీటి ప్రవాహం ఎక్కువగా వచ్చేది. ప్రస్తుత నీటి ప్రవాహం తక్కువగా వస్తుంది. దయచేసి అధికారులు సిబ్బంది సహాయంతో గంగాధర వచ్చే నీటి మార్గాన్ని ప్రతి మూడు లేదా నాలుగు నెలల కొకసారి శుభ్ర పరిస్తే నీటి ప్రవాహం ఎక్కువగా ఉంటుందని భక్తులు, స్థానిక ప్రజలు కోరుకుంటున్నారు. తద్వారా మొక్కలు, చెట్లు కొండ ప్రాంతంలో విరివిగా పెరిగి కాలుష్యం పెరగకుండా ఉంటుందని సిబ్బంది, భక్తులు అంటున్నారు.

మనస్థాపంతో ఖైదీ ఆత్మహత్య : పేకేరు లో విషాదఛాయలు

విశాలాంధ్ర-ఆనందపురం: మనస్థాపనతో ఉరి వేసుకుని కారాగారంలో ఆత్మహత్య చేసుకున్న సంఘటనతో ఆనందపురం మండలం పేకేరు గ్రామంలో విషాదఛాయలు అలముకున్నాయి. వివరాల్లోకి వెళితే... మండలంలో పేకేరు గ్రామానికి చెందిన ఉప్పాడ గౌరీ శంకర్(22) అత్యాచారం కేసులో నిందితుడిగా జైలు శిక్ష అనుభవిస్తు మంగళవారం సాయంత్రం కారాగారంలో ఆత్మహత్యకు పాల్పడి మృతిచెందాడు. తనను ప్రేమించానని నమ్మించిన యువతి కొంతమంది పెద్దమనుషుల ప్రమేయంతో అతనిపై ఫోక్స్ చట్టం కింద కేసు పెట్టి 20 సంవత్సరాలు జైలు శిక్ష విధించారు. ఈ క్రమంలో విశాఖ కేంద్ర కారాగారంలో శిక్ష అనుభవిస్తున్నాడు. మంగళవారం సాయంత్రం 4 గంటల సమయంలో కారాగారం బ్యారెక్ వెలుపల ఉన్న మరుగుదొడ్డికి వెళ్లి తన ప్యాంటు నాడాతో మెడకు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. తోటి ఖైదీలు, అధికారులు గుర్తించి వెంటనే కేజీహెచ్ తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు. గౌరీ శంకర్ కు తండ్రి చిన్నతనంలోనే చనిపోవడంతో తల్లి నరసమ్మ సరిగా పట్టించుకోలేదు. దీంతో పెద్దమ్మ బోడ్డి లక్ష్మి వద్ద పెరిగాడు. ఇటీవల కాలంలో పెద్దమ్మ చనిపోవడంతో గౌరీ శంకర్ గ్రామస్తులు స్నేహితులు మధ్య పెరిగాడు ఈ క్రమంలో అదే గ్రామానికి చెందిన యువతతో పరిచయమై పెళ్లి వరకు వచ్చింది. బాలికకు మైనర్ అవ్వడం వల్ల గౌరీ శంకర్ ని ఎలాగైనా కేసులో విరికించి పెద్ద మొత్తంలో సొమ్ము చేసుకోవాలని బాలికల తల్లిదండ్రులు ఆలోచనలతో కొంతమంది చేయి కలిపారు. దీంతో ఆయనపై కేసు పెట్టి జైల్ శిక్ష విధించడంతో మనోవ్యాధి గురై గౌరీ శంకర్ మృతిచెందాడని గ్రామస్తులు స్నేహితులు ఆరోపిస్తున్నారు. ఇటువంటి కేసులను నమోదు చేసేటప్పుడు గ్రామంలో తగిన విచారణ జరిపి తీర్పు ఇవ్వాలని గ్రామస్తులు మంగళవారం సాయంత్రం బాత్రూంలో ఉరిపోసుకుని మృతి చెందడం తో కరాగార సిబ్బంది కుటుంబ సభ్యులకు సమాచారం చెప్పడంతో కుటుంబ సభ్యులు గ్రామస్తులు కన్నీరు మున్నీరుగా విలపించారు. గ్రామానికి చెందిన యువతి తనను ప్రేమించి వివాహం చేసుకుంటామని నమ్మించారని తనకు పెద్దదిక్కు గౌరీ శంకరకు తండ్రి చనిపోవడంతో పెద్దదిక్కు లేకపోవడంతో జైలు పాలయ్యారని గ్రామస్తులు స్నేహితులు ఆరోపిస్తున్నారు. ఆ యువతకు కొంతమంది తప్పుడు నిర్ణయాల కారణంగానే కేసు పెట్టడం జరిగిందని ఈ కారణంగానే తీవ్ర మనస్థాపానికి గురై మృతి చెంది ఉంటాడని స్నేహితులు కుటుంబ సభ్యులు గ్రామస్తులు ఆరోపిస్తున్నారు.

హెచ్ఎంకు ఘన వీడ్కోలు..

విశాలాంధ్ర-భీమిలి: టిడిపి మండల అధ్యక్షులు డిఎన్ రాజు(బుజ్జిరాజు) ఆధ్వర్యంలో ప్రధానోపాధ్యాయుల పదవీ విరమణ కార్యక్రమం జరిగింది. భీమిలి మండలం తాళ్లవలస పంచాయతీ ఎంపిపి స్కూల్ ప్రధానోపాధ్యాయుడు నిడిగొట్లు.అప్పారావుకు విద్యా కమిటీ చైర్మన్ బోని ఈశ్వర్ కుమార్, నాయకులు,గ్రామస్తులు,విద్యాకమిటీ సభ్యులు ఘనంగా వీడ్కోలు పలికారు. ముందుగా పలువురు దుస్సాలువలు పూలగుచ్చాలుతో సన్మానించి జ్ఞాపికలు అందజేశారు. బుధవారం పదవీవిరమణ చేయబోతున్న అప్పారావుకు సతీ సమేతంగా ఘన సన్మానం చేశారు.కార్యక్రమానికి విచ్చేసిన అతిథులు ఎంఈఓ శివరాణి, ఎంపీటీసీ కోరాడ రమణ, టిడిపి సీనియర్ నాయకులు అనిల్ ప్రసాద్, మాజీ సర్పంచ్ బోని వెంకటరమణ,సాగిరాజు రాంబాబు తదితరులు పాల్గొని ప్రధానోపాధ్యాయుని సేవలను ప్రశంసించారు. ఈ సందర్భంగా టిడిపి మండల అధ్యక్షులు డిఎన్ రాజు(బుజ్జిరాజు) మాట్లాడుతూ నాణ్యమైన విద్యను అందించడంలో హెచ్ఎం విశేష సేవలందించారని కొనియాడారు. ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయులకు స్థానిక ప్రజలు సహాయ సహకారాలు అందించాలని తద్వారా గ్రామాన్ని అభివృద్ధి చేయవచ్చన్నారు.ఈ కార్యక్రమంలో సహచర ఉపాధ్యాయుని శామ్యూల్ రాణి,విద్యా కమిటీ సభ్యులు ఎద్దు రమాదేవి, సత్యవతి,మంగవేణి భాగ్యశ్రీ,తదితరులు పాల్గొన్నారు.

పురోహిత బ్రాహ్మణ సమైక్య కార్యవర్గ ఎన్నిక

విశాలాంధ్ర-పీఎం పాలెం: లోకా సమస్త సుఖినో భవంతు అనుక్షణం తపించే పురోహితులకు తగిన గౌరవ మర్యాదలు లభించడం లేదని ఆంధ్రప్రదేశ్ పురోహిత బ్రాహ్మణ సమాఖ్య ఆవేదన వ్యక్తం చేసింది. బుధవారం మధురవాడ శిల్పారామంలో సమాఖ్య అభ్యున్నతి కొరకు మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం, శ్రీ లక్ష్మీ గణపతి హెూమం అత్యంత నియమనిష్టలతో నిర్వహించారు. అనంతరం వంద లాదిగా హాజరైన పురోహితులు,అర్చకులతో పురోహిత బ్రహ్మ యజ్ఞ సభ నిర్వహించి నూతనంగా ఎన్నికైన రాష్ట్ర కార్యవర్గం, వివిధ జిల్లాల కార్యవర్గ సభ్యులకు ప్రముఖుల సమక్షంలో నియామక పత్రాలు అందచేసి ప్రమాణస్వీకారం చేయించారు. ఈ సందర్భంగా విశేష సేవలందించిన పలువురు పురోహితులను విప్ర సేవక్ పురస్కారాలతో ఘనంగా సత్కరించారు. తెన్నేటి విద్యాధరశాస్త్రి సభాధ్యక్షునిగా వ్యవహరించిన కార్యక్రమంలో రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు యామిజాల నరసింహ మూర్తి, అధ్యక్షుడు నారాయణమూర్తి, ప్రధాన కార్యదర్శి దుర్గబాబు, అధికార ప్రతినిధి రవి, కోశాధికారి మణిశంకర్, ప్రచార కార్యదర్శి ఉమామహేశ్వ శర్మ,రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ అంజనీ కుమార్ శర్మ, విశాఖపట్నం జిల్లా అధ్యక్షుడు సత్య శ్రీనివాస్ శర్మ జిల్లా కార్యదర్శి ఏలూరి వెంకట రమణ, తదితర్లు పాల్గొన్నారు.

జర్నలిస్టుల సమస్యలను పరిష్కరించండి

విశాలాంధ్ర-విశాఖపట్నం: పలు జర్నలిస్టు సంఘాలప్రతినిధి బృందం కలెక్టర్ కు వినతి పత్రం అందజేశారు. విశాఖ జిల్లాలో ప్రింట్,ఎలక్ట్రానిక్ మీడియాలో పనిచేస్తున్న జర్నలిస్టులు స్థానికంగా పలు సమస్యలు ఎదుర్కొంటున్నారని వాటి పరిష్కారానికి సహకరించాలని కోరుతూ పలు జర్నలిస్టు సంఘాల ప్రతినిధి బృందం బుధవారం కలెక్టర్ ఎం. ఎస్. హరేంధిర ప్రసాద్ కు వినతి పత్రం అందజేశారు. జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఇటీవల నూతనంగా బాధ్యతలు స్వీకరించిన ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి పూల బొకే అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ప్రైవేట్ పాఠశాలల్లో చదువుతున్న జర్నలిస్టుల పిల్లలకు గతంలో మాదిరిగా 50 శాతం పైగా ఫీజు రాయితీ కల్పిస్తూ మెమో ఉత్తర్వులు జారీ చేయాలని ఈ సందర్భంగా ఆయన కోరారు.గత సంవత్సరం మాదిరిగానే వర్కింగ్ జర్నలిస్ట్ హెల్త్ స్కీమ్ కు జర్నలిస్టులు చెల్లించాల్సిన ప్రీమియం సి.ఎస్.ఆర్ కింద చెల్లింపుకు సహకరించాలని, ఈ ఏడాది కూడా చెల్లింపుకు గత కలెక్టర్ ఏర్పాట్లు చేశారని ఆయన దృష్టికి తెచ్చారు. ఈ సందర్భంగా కలెక్టర్ స్పందిస్తూ ఈ సమస్యల పరి ష్కారానికి తక్షణమే చర్యలు కుంటానని హామీ ఇచ్చారు. కలెక్టర్ ను కలిసిన వారిలో ఏపీ యూడబ్ల్యూజే జిల్లా అధ్యక్ష,ప్రధాన కార్యదర్శులు కె.రాము, ఆర్.రామచంద్రరావు, ఉపాధ్యక్షుడు కె.చంద్రమోహన్, లోకల్ న్యూస్ పేపర్ అసోసియేషన్ అధ్యక్ష,ప్రధాన కార్యదర్శులు పి.సత్య నారాయణ, దవలే శ్వరపు రవికుమార్, ఏపీ ఎలక్ట్రానిక్ మీడియా విశాఖ జిల్లా అధ్యక్ష,ప్రధాన కార్యదర్శులు వాల్మీకి నాగరాజు, చందు యాదవ్, జాప్ జిల్లా ప్రధాన కార్యదర్శి కీర్తనరావు, స్మాల్ అండ్ మీడియం న్యూస్ పేపర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మొల్లి కమల్ కుమార్,ఏపీజేయూ జిల్లా అధ్యక్ష,ప్రధాన కార్యదర్శులు శ్రీధర్, ఎం. శ్రీహరి, విశాఖ స్మార్ట్ సిటీ రిపోర్టర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కార్యదర్శి కాళ్ళ సూర్యప్రకాష్, పలు జర్నలిస్టు సంఘాల నేతలు హరనాథ్,గోగుల శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

సీనియర్ ఫోర్‌మాన్‌కు ఉద్యోగ విరమణ శుభాకాంక్షలు

విశాలాంధ్ర-పెదగంట్యాడ: విశాఖపట్నం స్టీలు ప్లాంట్ లో గత 36 సంవత్సరాలు గా విధులు నిర్వహించి సీనియర్ జనరల్ ఫోర్ మాన్ గా బుధవారం ఉద్యోగ విరమణ సందర్భంగా తోటి ఉద్యోగులు, కుటుంబ సభ్యులు ఘనంగా సత్కారంచారు. క్రమ శిక్షణ తో పనిచేస్తూ, విధుల్లో తోటి వారితో కలిసి ఏల్ ఎం ఎం విభాగం లో ఎలక్ట్రికల్ పనుల్లో అనేక మైన సూచనలు, ఇచ్చి ప్లాంట్ ఉత్పత్తి ఉత్పధాకత లో తన దైన ప్రతిభ తో అనేక మైన సేవలు అందించారాని అయన ప్రతిభ ను కొనియాదారు. ఈ కార్యక్రమం లో యేల్లేటి శ్రీనివాస్, అనురాధ దంప తులను ఉక్కు అధికారులు, కార్మిక నాయ కులతో పాటు కుటుంబ సభ్యులు యేల్లేటి నాగేశ్వరరావు, యేల్లేటి శ్రీనివాస్, యేన్నేటి శ్రీనివాస్, పాలేశెట్టి శంకర రావు, బోయిదాపు ప్రసాద్ తదితరులు దుస్సాలువ తో సత్కరించారు.

రావికమతంలో పెన్షన్ల పంపిణీకి ఏర్పాట్లు పూర్తి

విశాలాంధ్ర-రావికమతం: మండలంలో ఆగస్టు1 గురువారం సామాజిక పెన్షన్లు పంపిణీకి అన్ని ఏర్పాట్లు పూర్తిచేశామని ఎంపీడీవో బానోజీరావు తెలిపారు. మండలంలో వివిధ కేటగిరీలకు చెందిన 12 వేల 276 మంది లబ్దిదారులు ఉన్నారని చెప్పారు. విరికి సంబంధించి 5 కోట్ల 22 లక్షల 28 వేల రూపాయలు నిధులు ఇప్పటికే సిద్ధంగా ఉన్నాయన్నారు. లబ్దిదారులకు ఇళ్ల వద్దనే పెన్షన్ పంపిణీకి మండల పరిషత్, రెవెన్యూ, ఐసిడిఎస్, సచివాలయం, ఆరోగ్య శాఖకు చెందిన 189 మంది ఉద్యోగులను ఎంపిక చేసేమన్నారు. వీలైనంతవరకు మొదటి రోజే పెన్షన్లు పంపిణీ చేయాలని ఆదేశాలు జారీ చేశామన్నారు.

పదవీ విరమణ పొందిన పోలీసు సిబ్బందిని సీపీ సత్కారం

విశాలాంధ్ర-విశాఖ క్రైమ్: పోలీస్ శాఖలో విధులు నిర్వర్తిస్తూ పదవీ విరమణ పొందిన ఎం.ఆర్.కే.రాజు, ఏడిసిపి (అడ్మిన్), ఆర్.వి.ఎస్ నారాయణ(ఏఎస్ఐ),మొహమ్మద్ జమాలుద్దిన్ (ఏఎస్ఐ), కే.సూర్యనారాయణ (ఏఎస్ఐ) జి.ఈశ్వర రావు(ఏఎస్ఐ),కే. వెంకటేశ్వరులు(ఏఎస్ఐ)వి.ప్రతాప్(హెడ్ కానిస్టేబుల్)జే.వెంకట రవి(ఏ ఆర్ హెడ్ కానిస్టేబుల్)ఎస్.శంకర రావు(ఏ ఆర్ హెడ్ కానిస్టేబుల్),సి.హెచ్.గోవింద రాజులు(ఏ ఆర్ హెడ్ కానిస్టేబుల్)గార్లను ఈ రోజు నగర పోలీసు కమీషనర్ డా.శంఖబ్రత బాగ్చి తన కార్యాలయంలో ఘనంగా సత్కరించారు, నిన్నటితో తమ సర్వీస్ ను ముగించుకొని పదవీ విరమణ పొంది గత 40 సంవత్సరాలుగా క్రమశిక్షణతో పోలీస్‌శాఖలో పనిచేస్తూ ప్రజలకు సేవలు అందించిన ఈ పది మంది అధికారులను సీపి అభినందించారు. అనంతరం పదవీ విరమణ పొందిన పోలీసు అధికారుల కుటుంబాల ప్రస్తుత స్థితిగతులను అడిగి తెలుసుకున్నారు.తమ శేష జీవితాన్ని కుటుంబ సభ్యులతో కలిసి సంతోషంగా గడపాలని తెలిపారు.భవిష్యత్తులో ఏ విధమైన సహాయం కావాలన్నా వెంటనే తమను సంప్రదించాలని వారికి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రిటైర్మెంట్ పొందిన వారి కుటుంబ సభ్యులు,ఇతర పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

డెంగ్యూ వ్యతిరేఖ మాసోత్సవాలు ... అవగాహన ర్యాలీలు

విశాలాంధ్ర-యస్.రాయవరం: మండలంలో సర్వసిద్ధి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధి లో గల అన్ని గ్రామాల్లో డెంగ్యూ వ్యతిరేక మాసోత్సవాలు ముగింపు సందర్భంగా అవగాహన ర్యాలీ లు జిల్లా మలేరియా అధికారి కె .వరహాలు దొర ఆదేశాలమేర జాతీయ కీటక జనిత వ్యాధుల నియంత్రణా కార్యక్రమంలో భాగంగా జిల్లా అసిస్టెంట్ మలేరియా అధికారి పి.జె.ఎం.అర్.పి.నాయుడుసూచనల మేరకు కీటక జనిత వ్యాధులపై అవగాహన సదస్సు నిర్వహించి తదుపరి అవగాహన ర్యాలీ లు నిర్వహించామని మెడికల్ ఆఫీసర్లు .ఎస్.ఎస్.వి.శక్తి ప్రియ ఎస్.వాసంతి సంయుక్తంగా తెలిపారు. అలాగే వేమగిరి లో నిర్వహించిన అవగాహన సదస్సు ను ఉద్దేశించి ఆరోగ్య విస్తరణ అధికారి టి. నాగేశ్వరరావు మాట్లాడుతూ.... ప్రతి ఒక్కరు పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలనీ అప్పుడు మాత్రమే అందరూ విష జ్వరాలు బారిన పడకుండా ఆరోగ్యంగా వుండొచ్చునని అవగాహన కల్పించారు. వీరితో పాటు వి.హెచ్.ఎన్ ఎం.రత్న సఖి, హెల్త్ సూపర్వైజర్ ఎస్ ఎస్ వి ప్రకాష్ అలాగే ఈ సందర్భంగా యస్. రాయవరం గ్రామంలో జెడ్.పి.హెచ్.స్కూల్ విద్యార్థులు తో కలిసి నిర్వహించిన ర్యాలీ ని ఉద్దేశించి ఎఫ్.డి.వి క్లస్టర్ పర్యవేక్షకులు డాక్టర్ వి.ఎన్.వి.ఎస్.ప్రసాద్ మాట్లాడుతూ..... కీటక జనిత వ్యాధులయిన మలేరియా ఆడ ఎనాఫిలిస్ దోమ కాటు వలన, ఫైలేరియా,మెదడు వాపు క్యూలెక్స్ దోమ కాటు వలన,డెంగ్యూ ,చికెన్ గున్యా ఈడిస్ ఈజిప్ట్ అనే టైగర్ దోమ కాటు వలన ఈ సీజన్‌లో ఆ జ్వరాలు బారిన పడతారని ,ఈ సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ప్రతి ఒక్కరు ఇంటి పరిసరాలు పరిశుభ్రంగా ఉంచు కోవాలనీ అలాగే ఇంట్లో నిలువ వున్న నీటి పాత్రలపై మూతలు ఉంచుకోవాలని తద్వారా కీటక జనిత వ్యాధులకు కారణమైన దోమలను లార్వా దశలోనే సులభంగా అరికట్టవచ్చునని దీని కొరకు ఫ్రై డే..డ్రై డే సందర్భంగా మనం ప్రతి శుక్రవారం , శనివారం ,అది వారం నిర్వహించే యాంటీ లార్వా ఆపరేషన్ వలన నిల్వ నీటిలో వుండే అనగా ఫ్రిజ్ వెనుక తొట్టెలో, టైర్ లు లో, రుబ్బు రోళ్లు లో, ప్లాస్టిక్ డ్రమ్ములలో, పాడుపడిన పాత్రలు, ఎయిర్ కూలర్ లు లో, కొబ్బరి చిప్పలు లో ,సిమెంట్ గోలల్లో , డ్రింక్ సీసాలు లో , పూల కుండీలు లో లార్వాలను గుర్తించి తక్షణం వాటిని నిర్మూలించవచ్చునని తద్వారా దోమల వృద్ధి నీ లార్వా దశలోనే అరికట్టగలమని లార్వా నివాసముండే అవాసాలను అనగా కొబ్బరి చిప్పలు, ప్లాస్టిక్ డ్రింక్ సీసాలు, మట్టి పాత్రలు , తినిన తాటి కాయలు, ప్లాస్టిక్ డ్రమ్ములు , పూల కుండీలు ప్రదర్శించి అవగాహన కల్పించారు. వేమగిరి, యస్ రాయవరంలో నిర్వహించిన అవగాహన ర్యాలీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడి కార్యకర్తలు, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయునిగా రత్నరాజు సేవలు మరువలేనివి..

విశాలాంధ్ర-మునగపాక: గురుబ్రహ్మ గురు విష్ణు గురుదేవో మహేశ్వరః అంటూ గురువును పూజించడంతోపాటు ఆ పదాన్ని సార్థకత చేసు కొని 40 ఏళ్ల పాటు ఉపాధ్యాయ వృత్తులో కొనసాగుతూ ఎంతో మందిని ప్రయోజ కులను చేసి పదవి విరమణ పొందుతున్న వాడ్రాపల్లి ప్రధానోపాధ్యాయుడు బర్రె రత్నరాజు దంపతులను గ్రామస్తులతో పాటు సహ ఉద్యోగులు స్థానిక నేతలు విద్యార్థులు ఘనంగా వీడ్కోలు పలికారు. అంతేకాకుండా రత్నరాజు చేసిన సేవలను కొనియాడటంతో పాటు తొమ్మిదేళ్లపాటు ఒకే గ్రామంలో సేవలందిస్తూ విద్యార్థులను ఉత్తమలుగా తీర్చిదిద్దడంతో పాటు పాఠశాల అభివృద్ధికి ఎంత కృషి చేశారని గ్రామ సర్పంచ్ కాండ్రేగుల నూకరాజు, టీడీపీ అనకాపల్లి జిల్లా అధికార ప్రతినిధి మల్ల నర్సింగ్రావు తో సహా పలువురు నేతలు సహ ఉద్యోగులు కొనియాడారు. పదవి విరమణ సందర్భంగా గ్రామంలో ఘనంగా మేళతాల వాయిద్యాలతో ఊరేగింపు కార్యక్ర మాన్ని పెట్టారు. ఆ జ్ఞాపకాలు మరువలేని అంటూ హెచ్ఎం రత్నరాజు వీడ్కోలు సభలో విద్యార్థులకు స్థానికులకు కృతజ్ఞతలు తెలి పారు. ఒక ఉపాధ్యాయుడిగా రిటైర్ అవుతున్న సంద ర్భంగా గ్రామ మొత్తం కలిసి ఘనంగా సత్కరిం చడంతో పాటు పండగ వాతావరణం తలపించేలా అడుగడుగునా జనం నీరాజనం పలుకుతూ విద్యార్థులు అభినందనలతో నేతల సంతోషాల మధ్య వందలాది జన సందోహంతో వాడ్రాపల్లి సందడి వాతావరణం నెలకొంది. సభా ప్రాంగణం అంతా పుష్ప సోయగంతో కనిపించడంతోపాటు పదవి విరమణ పొందుతున్న రత్నరాజు దంపతులను గజమాలతో సత్కరించి తమ అభిమానాన్ని చాటుకున్నారు. వివిధ ప్రాంతా లలో ఆయన అందించిన సేవలు వర్ణనతీతమంటూ ఎందరికో ఆదర్శం అంటూ కొని యాడారు. ఈ సందర్భంగా గ్రామంలోని మహిళలు సచివాలయ సిబ్బంది అంగన్వాడీ సిబ్బంది సహా గ్రామస్తులు ఘనంగా వీడ్కోలు పలికారు. అనంతరం పదవి సత్కారం పొందిన రత్నరాజు దంపతులు మాట్లాడుతూ. ఇన్నేళ్లగా తాను చేసిన కృషి ఈ రూపంలో నన్ను ఆదరిస్తున్న మీ అందరికీ కన్నీటి భాష్పాలతో అభినందనలు తెలిపారు.

ప్రీ లిటిగేషన్ కౌన్సెలింగ్ ఫోరం (పిఎల్ సి ఎఫ్) ను ప్రారంభించిన నగర సీపీ

విశాలాంధ్ర-విశాఖ క్రైమ్ : సివిల్ వివాదాల సత్వర పరిష్కారానికై ప్రీ లిటిగేషన్ కౌన్సెలింగ్ ఫోరం(పిఎల్ సి ఎఫ్) ను ప్రారంభించిన నగర పోలీసు కమీషనర్ శంఖబ్రత బాగ్చి, ఈ సందర్భంగా సీపి మాట్లాడుతూ ప్రిన్సిపల్ ఆఫ్ జస్టిస్ అనుసరిస్తూ ఇరువర్గాలకు సమానత్వం మరియు సమానమైన న్యాయం అందిస్తూ నిష్పక్షపాతంగా మధ్యవర్తిత్వం చేయడం కోసం మరింత బలోపేతం చేయడం జరుగుతుందనీ.అధిక సంఖ్యలో వృద్ధులు వారి పదవీ విరమణ తరువాత విశాఖ నగరంలో స్థిరపడాలనుకోవడం, అలాగే ఇతర ప్రాంతాల నుండి వృద్ధులు కూడా ఇక్కడకు వచ్చి స్థిర పడడం జరుగుతుందని, వారికి ఏదైనా సివిల్ వివాదం కలిగితే సంబంధిత పోలీస్ స్టేషను కు వెళ్ళలేక ఇబ్బంది పడేవారి కోసం ప్రత్యేకముగా ఈ ప్రీ లిటిగేషన్ కౌన్సెలింగ్ ఫోరం(పిఎల్ సి ఎఫ్) ఏర్పాటు చేయబడింది అని న్నారు . వృద్ధుల, వయోవృద్ధుల పలు సమస్యలకు గురి అవుతున్నారని వారి సొంత ఇంట్లో అద్దెకు ఉంటూ ఇళు ఖాళీ చేయకపోవడం, అద్దె చెల్లించక పోవడం, వారి స్థలాలు కబ్జాచేయడం, వారి నగదు తీసుకొని తిరిగి ఇవ్వక పోవడం వంటి వె కాక ఇతర సివిల్ వివాదాలలో తగు ప్రాధాన్యం ఇస్తూ వారి సమస్యలను ఇరు వర్గాలతో చర్చలు జరిపి సామరస్యముగా చట్టప్రకారం పరిష్కారం చేయడం కోసం ఈ ఫోరం పనిచేస్తుందని అన్నారు ఎవరైనా వృద్ధులు అనారోగ్య కారణాల వల్ల లేదా ఇతర సమస్యలు కారణముగా నేరుగా రాలేక పోతే , వీడియో కాల్ ద్వారా ఫిర్యాదు తెలిపి, అవసరమైన డాక్యు మెంట్లు అందచేస్తే తక్షణమే చర్యలు తీసుకో బదతాయని, కోర్టు కేసులు గల సమస్యలు ఇక్కడ వరిష్కరించబడవనీ, ఏదైనా వివాదం నందు పట్టదగిన నేరం ఉంటే, తక్షణం సంబంధిత పోలీస్ స్టేషన్ నందు ఎఫ్.ఐ.ఆర్ నమోదు చేయడం జరుగుతుందనీ. కుటుంబ వివాదాలు, పొరుగువారు/ ఇతర వ్యక్తులతో వివాదాలు, డబ్బు, ఋణాలు మరియు చిట్స్ వివాదాలు, భూ యజమాని/ అద్దెదారు వివా దాలు, న్యూసెన్స్/ఇతర సమస్యలకు సంబం ధించిన వివాదాలు పరిష్కారం కోసం (పిఎల్ సి ఎఫ్) పాటుపడతుందని . ముఖ్యముగా ప్రతీ సమస్యనూ ఇరువర్గాలతో చర్చించి, పార దర్శకంగా ,సామరస్యపూర్వకంగా సమస్యను పరిష్కరించడం జరుగుతుందని ఎవ్వరి స్వలాభం లేదా స్వార్థం కోసం ఇక్కడ చర్యలు తీసుకొన బడవని కమీషనర్ స్పష్టం చేసారు . నగర ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం, పోలీస్ స్టేషన్ నందు ఫిర్యాదులు చేస్తున్నారని . అలా ఇచ్చే ఫిర్యాదులలో ఎక్కువ శాతం చిన్న చిన్న వివాదములు లేదా తగాదాలతో కూడిన సివిల్ వివాదాలు అయి ఉంటున్నాయని . ఎక్కువ శాతం కేసులు నగదు లేదా ఆస్థి వివాదాలు అయి ఉండటం చేత పోలీసులు వాటిలో ఉన్న క్రిమినల్ అంశములు బట్టి ఎక్కువ సమయం కేటాయించి దర్యాప్తు చేస్తుండడం తో . వీటిలో చాలా శాతం కేసులు కోర్టులో విచారణ జరగకుండానే న్యాయపరిధిలో (కాంపౌండ్) సమ్మేళనం చేయబడుతున్నాయి. ఈ నేపథ్యంలో రెవెన్యూ శాఖ నుంచి ఒక అధికారి, మునిసిపల్ కార్పొరేషన్ నుండి ఒకరు, మరియు పోలీసు శాఖ నుండి ఒక అధికారితో కూడిన ప్రీ లిటిగేషన్ కౌన్సెలింగ్ ఫోరం ప్రారంభించాలని జిల్లా అధికారులు నిర్ణయించారు ఈ ఫోరం లో విశాఖపట్నం జిల్లా కలెక్టర్, నగర పోలీసు కమిషనర్, జివిఎంసి కమిషనర్ సభ్యులుగా ఉంటారు . ఈ కమిటీ (ప్రీ లిటిగేషన్ కౌన్సెలింగ్ ఫోరం) ప్రతీ పనిదినమందూ(సోమవారం నుండి శనివారం) పోలీస్ బేరక్స్ ప్రాంగణంలో కార్యనిర్వహణలో ఉంటారు. వివాదాలకు సంబందించిన పార్టీలను సిట్టింగ్ రోజులలో సమన్స్ ద్వారా పిలిపించి, కౌన్సిలింగ్ జరిపి, వివాదము పరిష్కారము జరిపి, పిదప పార్టీలు రాజీ పడినట్లు అయిన అదే రోజున లోక్ అదాలత్/లీగల్ సర్వీసెస్ ఆథారిటీ వారి ఎదుట ఇరు పార్టీలను హాజరు పరిచి చట్టపరమైన సేవల అథారిటీ చట్టం 1987, చివరి అవార్డు యూ/ఎస్ 22 (సి) ప్రకారం అంతిమ ఉత్తర్వులు సంబందిత న్యాయస్థానం ద్వారా ఇవ్వడం జరుగుతుంది.పైన పేర్కొన్న సివిల్ సమస్యల కోసం ప్రీ లిటిగేషన్ కౌన్సెలింగ్ ఫోరం సేవలను పొందాలనుకునే పౌరులు సంబంధిత పోలీసు స్టేషన్లను సంప్రదించవచ్చు,ఈ ప్రీ లిటిగేషన్ కౌన్సెలింగ్ ఫోరం ఈ రోజు నుండే (31.07.2024) ప్రజలకు అందుబాటులో ఉంటుందని సీపి ప్రజలకు తెలిపారు.